క్లుప్తంగా

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

బోథ్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉచిత ప్రయాణాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా రూ.10 లక్షల వరకు వైద్య సదుపాయాన్ని పెంచడంతో ఆ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి రాథోడ్ నరేందర్, ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ సంధ్యారాణి, ఏఎంసీ చైర్మన్ రుక్మణ్ సింగ్, నేరడిగొండ ఎంపీపీ సజన్, సర్పంచ్ సురేందర్, కోఆప్షన్ సభ్యులు తాహెర్ బిన్ సలాం, నాయకులు, పాల్గొన్నారు.

ఎమ్మెల్యే రాజాసింగ్‌ను కలిసిన నాయకులు



ఎమ్మెల్యే రాజాసింగ్‌తో బీజేవైఎం నాయకులు

ఆదిలాబాద్: గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను ఆదిలాబాద్ బీజేవైఎం నాయకులు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. హైదరాబాదులోని ఆయన నివాసంలో కలిసి, శాలువాతో సన్మానించారు. నాయకులు సురేందర్, ఆత్రం సాయి, వేముల శ్రీనివాస్, శ్రీకాంత్, శివ, కిరణ్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యే బొజ్జును కలిసిన కాంగ్రెస్ నాయకులు



పుష్పగుచ్ఛం అందజేస్తున్న నాయకులు

కైలాస్‌నగర్: ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖానాపూర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా గెలుపొందిన వెడ్మ బొజ్జును ఆదివారం కాంగ్రెస్ నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. జెడ్పీటీసీ గణేష్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ బాబన్న, మాజీ సింగిల్ విండో చైర్మన్ ప్రకాష్ రావు, యువజన కాంగ్రెస్ అసెంబ్లీ ప్రధాన కార్యదర్శి రూపేష్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు. ఏజెన్సీలోని ఆదివాసీల సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

అన్నదానం

కైలాస్‌నగర్: ఆదిలాబాద్ పట్టణ, పరిసర ప్రాంతాల్లోని నిరుపేదల ఆకలిని తీర్చేందుకు ప్రతీ ఆదివారం సంగెం ట్రస్ట్ ఆధ్వర్యంలో చేపట్టిన అన్నదాన కొనసాగుతోంది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో పేదలకు అన్నదానం చేశారు. ట్రస్ట్ సభ్యులు పేదలకు భోజనాన్ని వడ్డించారు. కార్యక్రమంలో న్యాయవాది సుధీర్ కుమార్ సంగెం, ట్రస్ట్ సభ్యులు మహేందర్ రెడ్డి, సలీమ్, శుభాష్, అంబయ్య, రాజయ్య, లకన్ పాల్గొన్నారు.

రక్తదానం

బోథ్: నిర్మల్‌లో ఒకరికి ఓ పాజిటివ్ రక్తం అవసరం ఉండగా మండల కేంద్రానికి చెందిన దీటి సురేష్ అనే యువకుడు అత్యవసర పరిస్థితుల్లో రక్తదానం చేశాడు. ఈసందర్భంగా ఆయనను పలువురు అభినందించారు. మానవ వెల్ఫేర్‌సొసైటీ అధ్యక్షుడు అనిల్ కృతజ్ఞతలు తెలిపారు.

'పేదలకు కార్పొరేట్ వైద్యం అందిస్తాం'

ఖానాపూర్: ప్రభుత్వ ఆసుపత్రులకు వచ్చే నిరుపేదలకు రూ.10లక్షల రాజీవ్‌ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తామని ఖానాపూర్ మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ చిన్నం సత్యం, ఆ పార్టీ మండలాధ్యక్షుడు దయానంద్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో డిప్యూటీ డీఎంహెచ్‌వో రాజేందర్, ఎంపీడీవో మల్లేష్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలోని అన్ని రాజీవ్ ఆరోగ్యశ్రీ ఎంప్యానెల్డ్ ఆస్పత్రుల్లో ఈ పథకం తక్షణమే అమల్లోకి వస్తుందన్నారు. అనంతరం రాజీవ్ ఆరోగ్యశ్రీ పోస్టర్‌ను వైద్యులు, సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైద్యులు కె.శివ, సంతన్, హెచ్ఈ జయలలిత, నాయకులు అమానుల్లాఖాన్, షబ్బీర్‌పాషా, నిమ్మల రమేశ్, కిశోర్‌నాయక్, రాజునాయక్, జంగిలి శంకర్, మాజీద్, షౌకత్‌పాషా, గంగనర్సయ్య, మడిగెల గంగాధర్, రాజేశ్వర్ తదితరులు ఉన్నారు.

తగ్గనున్న రబీ సాగు

- పత్తి దిగుబడిపై వర్షాల ప్రభావం
- శనగ, జొన్న సాగుపై ఆసక్తి
- ఈనెల చివరి వరకు పంటలు సాగు చేసే అవకాశం



సాగవుతున్న శనగ పంట

ఆదిలాబాద్‌రూరల్: మండలంలో ఈఏడాది వానాకాలంలో సోయాబీన్ పంట సాగు తగ్గి పత్తి సాగు పెరిగింది. దీంతో ఈఏడాది రబీ సాగు తగ్గనుందని మండల వ్యవసాయాధికారులు చెబుతున్నారు. దీనికి ప్రధాన కారణం గత ఏడాది చివరిలో పత్తి ధర అధికంగా ఉండడమేనని తెలుస్తోంది.

సాగు ఇలా..

గత ఏడాది వానాకాలంలో 33 వేల ఎకరాలలో పత్తి సాగు కాగా.. 8వేల ఎకరాలలో సోయాబీన్, 2 వేల ఎకరాలలో జొన్న పంట సాగైంది. ఈఏడాది వానాకాలంలో 35 వేల ఎకరాలలో పత్తి సాగైంది. రబీలో 7 వేల ఎకరాలలో శనగ, 3వేల ఎకరాలలో జొన్న సాగవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు.

ఈనెల చివరి వరకు సాగు..

రబీ సాగులో భాగంగా ప్రతీ ఏడాది డిసెంబర్ చివరి మాసం వరకు పంటలను వేయనున్నారు. అందులో భాగంగానే మండలంలో ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది రబీలో శనగ, జొన్న పంటలు సాగు చేస్తారు. సోయా పంటలను తొలగించిన రైతులు ఈనెల చివరి వరకు పంటలు సాగు చేయనున్నట్లు అధికారులు పేర్కొంటున్నారు.

రబీపైనే ఆశలు..

ఇటీవల కురిసిన వర్షాలకు పత్తి పంటపై తీవ్ర ప్రభావం పడింది. పెట్టుబడులు కూడా గిట్టుబాటు అయ్యేలా లేదని రైతులు ఆందోళన చెందుతున్నారు. వాతావరణం అనుకూలిస్తే రబీలో సాగు చేసే పంట దిగుబడులపై ఆధారపడాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు.

రబీ సాగు తగ్గే అవకాశం ఉంది

వానాకాలంలో ఈ ఏడాది పత్తి సాగు పెరిగి సోయాబీన్ సాగు తగ్గింది. దీంతో రబీ పంట సాగు తగ్గే అవకాశం ఉంది. సోయాబీన్ పంటను తొలగించిన రైతులు రబీలో శనగ, జొన్న లాంటి పంటలు సాగు చేస్తారు. ఈనెల చివరి వారం వరకు పంటలు వేసుకుంటారు.

– అష్రఫ్, మండల వ్యవసాయాధికారి, ఆదిలాబాద్ రూరల్

గిరిజనుల కష్టాలు తీరేనా?



వాగు దాటుతున్న వైద్య సిబ్బంది, గ్రామస్తులు (ఫైల్)

- కొత్త ప్రభుత్వంపై ఆశలు
- రోడ్డు సౌకర్యం లేక విద్య, వైద్యానికి దూరం
- ఇటీవల ఎన్నికలు బహిష్కరణకు పిలుపునిచ్చిన కొత్తపల్లి ప్రజలు
- కలెక్టర్ హామీతో ఓటు వేసిన గ్రామస్తులు

బజార్‌హత్నూర్: మండలంలోని మారుమూల గ్రామం కొత్తపల్లి ఏర్పడి ఐదు దశాబ్దాలు అవుతున్నా.. గ్రామానికి మాత్రం ఇప్పటి వరకు రోడ్డు సౌకర్యం లేదు. గ్రామానికి వెళ్లే దారిలో బంద్రేవ్ వాగు ఉండడంతో వర్షాకాలం వచ్చిందంటే బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోతాయి. కొత్తపల్లి గ్రామ జనాభా 300 వరకు ఉంటుంది. ప్రాథమిక పాఠశాల ఉన్నా.. వర్షాకాలం మూడు నెలల్లో మూడు వారాలు కూడా తరగతులు జరగవు. నిత్యావసర సరుకులు, రేషన్ సరుకుల కోసం మండల కేంద్రానికి ఐదు కిలోమీటర్లు నడుచుకుంటూ.. వెళ్లి వాగుదాటి రావాల్సిన పరిస్థితి. వ్యవసాయానికి ఎరువులు అవసరమున్న, అనారోగ్యంతో ఎవరైన మంచం పట్టిన ఎడ్లబండ్లపై గ్రామం దాటించాల్సి వస్తోందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఆదివాసీ గిరిజనులు రోడ్డు సౌకర్యం లేక విద్య వైద్యానికి దూరమవుతున్నారు.

ఎన్నికలప్పుడే హామీలు..



అసెంబ్లీ ఎన్నికల సమయంలో నాయకులు గ్రామానికి వచ్చి కొత్త ప్రభుత్వంలో రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానని హామీలు ఇవ్వడమే తప్పా.. ఇప్పటి వరకు ఒక్క మీటరు రోడ్డు నిర్మించలేదు. తహసీల్దార్ శంకర్ కలెక్టర్‌తో మాట్లాడించడంతో హామీ ఇచ్చారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. – రామేశ్వర్, కొత్తపల్లి

సమస్యలు పరిష్కరిస్తాం



నవంబర్ 30న అసెంబ్లీ ఎన్నికలను బహిష్కరించిన కొత్తపల్లి గ్రామస్తులతో కలెక్టర్ రాహుల్ రాజ్‌తో ఫోన్‌లో మాట్లాడించాను. ఓటు హక్కు వినియోగించుకోవాలని గ్రామస్తులను కోరారు. త్వరలో కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించి రోడ్డు, వంతెన నిర్మాణానికి నిధులు కేటాయించుటకు కృషి చేస్తారు.

– శంకర్, తహసీల్దార్, బజార్‌హత్నూర్

ఓడినా ప్రజల మధ్యనే ఉంటా

- కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి



పార్టీలో చేరిన కాలనీవాసులతో శ్రీనివాస రెడ్డి

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎన్నికల్లో ఓడినా ప్రజల మధ్యనే ఉంటానని, కాంగ్రెస్ అసెంబ్లీ నియోజకవర్గ ఇన్‌చార్జి కంది శ్రీనివాస రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని సంజయ్ నగర్‌లో నల్వాల సుమ ఆధ్వర్యంలో పలువురు కాలనీ వాసులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రాష్ట్రంలో ఈ పదేళ్లు కాంగ్రెస్ అధికారంలో ఉండబోతోందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను పార్టీ నిలబెట్టుకుందని మహిళలకు ఉచిత బస్ ప్రయాణం, రూ.10 లక్షల రాజీవ్ ఆరోగ్యశ్రీ బీమా హామీలు అమలు చేసిందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు బాలూరి గోవర్ధన్ రెడ్డి, భూపెల్లి శ్రీధర్, ముడుపు దామోదర్ రెడ్డి, రషీద్ ఉల్ హాక్, ఉయిక ఇందిర, మునిగెల నర్సింగ్ పాల్గొన్నారు.

రిమ్స్ కార్మికులకు అండగా ఉంటాం

కైలాస్‌నగర్: మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న బినామీ కంపెనీలతో ఇన్ని రోజులు ఇబ్బందులు ఎదుర్కొన్న రిమ్స్ కాంట్రాక్టు ఉద్యోగులు, కార్మికులకు అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు కంది శ్రీనివాస రెడ్డి, బాలురి గోవర్ధన్ రెడ్డి అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని ప్రజాసేవ భవన్‌లో రిమ్స్ ఉద్యోగులు, కార్మికులు వారిని కలిసి తమ సమస్యలను నివేదించారు. తమకిచ్చే అరకొర వేతనాల్లో కాంట్రాక్టర్ కోత పెడుతున్నారని, ఒక్కో కార్మికుని జీతం నుంచి రూ.3వేల వరకు కట్ చేస్తున్నారని వాపోయారు. పేషెంట్ కేర్ టేకర్స్‌గా తీసుకున్న వారికి ఇతర విధులు అప్పజెపుతూ పని భారం మోపుతున్నారని ఆరోపించారు. తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేయాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న కుమారులు, వారి బినామీ కంపెనీలతో రిమ్స్‌లో ఉద్యోగులు, కార్మికులు ఎన్నో ఇబ్బందులు పడ్డారని గుర్తు చేశారు. ఇకపై అలా కాకుండా ఉద్యోగ, కార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కార్మిక సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి అక్రమ్‌ఖాన్, దేవిదాస్, తదితరులు పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా ఇసుక వేలం

- రూ.10 లక్షలకు దక్కించుకున్న వ్యాపారులు

తాంసి: భీంపూర్ మండలంలోని తాంసి(కె) గ్రామ శివారు ప్రాంతంలో పెన్‌గంగ నది ప్రవహిస్తోంది. నదిలో ఇసుక తవ్వకాల కోసం రెండు రోజుల క్రితం గ్రామస్తులు వీడీసీ ఆధ్వర్యంలో అనధికారికంగా ఇసుక వేలం వేశారు. కాగా.. గ్రామానికి కొందరు జట్టుగా ఏర్పడి తక్కువ ధర రూ.10 లక్షలకు ఇసుక వేలంను దక్కించుకున్నారు. ఇదే గ్రామంలో 25 రోజుల క్రితం గ్రామస్తులు వేలం పాట నిర్వహించగా గ్రామానికి చెందిన వ్యక్తి ఇతరుల ద్వారా రూ.25 లక్షలకు దక్కించుకున్నాడు. రూ.50వేలు అడ్వాన్స్ చెల్లించి ఇసుక తరలించడం ప్రారంభించాడు. ఒప్పందం ప్రకారం గ్రామానికి డబ్బులు చెల్లించకపోవడంతో గ్రామస్తులు ఇసుక వేలం రద్దు చేసి, మళ్లీ వేలం నిర్వహించారు. గ్రామానికి చెందిన కొందరు సిండికేట్‌గా మారి తక్కువ ధరకే ఇసుక వేలం దక్కించుకున్నారు. ఉన్నతాధికారులు స్పందించి అక్రమ ఇసుక రవాణను అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అసంపూర్తిగా క్రీడా మైదానం



అసంపూర్తిగా ఉన్న క్రీడా మైదానం ఇదే..

నార్నూర్: మండల కేంద్రంలోని ఏకలవ్య ఆదర్శ పాఠశాల విద్యార్థుల కోసం రెండేళ్ల క్రితం హ్యాండ్ బాల్‌కోర్ట్, సీసీరోడ్లు, డ్రైయినేజీ, క్రీడా మైదానం, ఇతర మరమ్మతుల పనుల కోసం ప్రభుత్వం కోటి రూపాయలు మంజూరు చేసింది. రెండేళ్లుగా పనులు నత్తనడకన సాగుతుండడంతో విద్యార్థులకు ఇబ్బంది పడుతున్నారు. సరైనా క్రీడా మైదానం లేక క్రీడల్లో రాణించలేకపోతున్నామని వాపోతున్నారు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు నిమ్మకు నిరేత్తినట్లు వ్యవహరిస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత శాఖ అధికారులు స్పందించి పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ విషయమై ఐటీడీఏ జేఈ సునీల్ రాథోడ్‌ను వివరణ కోరగా పనులు జరుగుతున్నాయి. బిల్లులు పెండిగ్‌లో ఉండడం వలన జాప్యం జరుగుతుందని తెలిపారు.

అయ్యప్పస్వామి పల్లకి ఊరేగింపు



పూజలు చేస్తున్న అయ్యప్ప స్వాములు

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్‌కోటి గ్రామంలో ఆదివారం అయ్యప్పస్వామి పల్లకిని ఊరేగించారు. గ్రామానికి చెందిన అయ్యప్ప స్వాములు అలంకరించిన పల్లకిలో అయ్యప్ప ఉత్సవ మూర్తిని ఏర్పాటు చేసి, వేంకటేశ్వర స్వామి ఆలయం నుంచి ప్రధానవీధుల గుండా ఊరేగించారు. మహిళలు మంగళ హారతులతో హాజరై ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో గురుస్వాములు జాదవ్ గణేష్, రాజు, మనీష్ రెడ్డి, సర్పంచ్ గంగయ్య, సంతోష్, వెంకటేశ్, నర్సింగ్ పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ

జైనథ్: మండల కేంద్రంలో అయ్యప్ప పడిపూజను ఘనంగా నిర్వహించారు. శనివారం రాత్రి లక్ష్మీనారాయణ స్వామి ఆలయ ప్రాంగణంలో మెట్ల పూజ కార్యక్రమం చేపట్టారు. అనంతరం అగ్నిగుండ ప్రవేశం నిర్వహించారు. భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి, స్వామి వారికి పూజలు చేశారు.

వేధింపులకు గురైతే ఆందోళన చెందవద్దు



అవగాహన కల్పిస్తున్న సమన్వయకర్త యశోద

ఆదిలాబాద్‌టౌన్: మహిళ ఉద్యోగులు, యువతులు వేధింపులకు గురైతే ఆందోళన చెందవద్దని, ధైర్యంగా ఎదుర్కొని ముందుకు సాగాలని మహిళ సాధికారత కేంద్రం సమన్వయకర్త యశోద అన్నారు. ఆదివారం ఆదిలాబాద్ పట్టణంలోని బాలికల వసతిగృహంలో మానవ హక్కుల దినోత్సవం, అంతర్జాతీయ స్త్రీ హింస వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహిళలను ఎవరైన ఇబ్బందులకు గురిచేస్తే సఖీ కేంద్రం, మహిళ సాధికారత కేంద్రానికి ఫిర్యాదు చేయవచ్చన్నారు. మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని సూచించారు. గృహ హింస, సైబర్ క్రైమ్, మహిళ సాధికారత, బేటీ బచావో బేటీ పడావో గురించి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సఖీ కేంద్రం కోఆర్డినేటర్ లావణ్య పాల్గొన్నారు.

అధ్వాన రోడ్డుతో అవస్థలు



కాలినడకన వెళ్తున్న రాయపూర్‌తండా గ్రామస్తులు

- బీటీరోడ్డు నిర్మించాలని కోరుతున్న రాయపూర్‌తండా గ్రామస్తులు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

బేల: ప్రభుత్వాలు మారుతున్నాయి.. ప్రజాప్రతినిధులు మారుతున్నారు.. కాని ఏజెన్సీ గ్రామాల రోడ్లు మాత్రం మారడం లేదు. మండలంలోని రాయపూర్‌తండా గ్రామానికి సరైన రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. ఏదైనా పని ఉంటే ఆటో ప్రయాణం లేదంటే కాలినడకే శరణ్యం అని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు సౌకర్యం కల్పించాలని అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా.. పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. రాయపూర్‌తండాలో 35 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. మొత్తం జనాభా 130 వరకు ఉంటుంది. గతంలో ఐటీడీఏ పరిధిలో మొరం రోడ్డు వేశారు. ఆ రోడ్డంతా వర్షాలకు కోతకు గురై దెబ్బతింది. గ్రామానికి బీటీరోడ్డు సౌకర్యం మంజూరు చేయాలని గ్రామస్తులు ప్రజాప్రతినిధులు, అధికారులకు విన్నవించినా.. నిధులు మంజూరు కాలేదు. దీంతో రోడ్డు సమస్య ఎక్కడిక్కడే ఉండిపోయింది. మండలంలోని రాయపూర్‌తండా గణేష్‌పూర్ గ్రామానికి రెండు కిలోమీటర్ల దూరంలో అటవీ పక్కన ఉంటుంది. మార్గమధ్యన రాళ్లు, రప్పలు ఉంటాయి. వర్షకాలంలో ఐదు చోట్ల చిన్న వాగులు పారుతుంటాయి. వర్షాకాలంలో బయటి ప్రపంచానికి సంబంధాలు ఉండవు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రామానికి బీటీ రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



మా గ్రామానికి బీటీ రోడ్డు మంజూరుపై లీడర్లు, ఆఫీసర్లు పట్టించుకోవడం లేదు. ఏళ్ల నుంచి అందరికీ విన్నవిస్తునే ఉంటున్నాం. కనీసం వాహనాలు కూడా వెళ్లాలేని పరిస్థితి. ఇప్పటికైనా అధికారులు బీటీరోడ్డు నిర్మించాలి.

– రాయచంద్

ఇబ్బంది పడుతున్నాం



గణేష్‌పూర్ గ్రామం నుంచి రాయపూర్‌తండా గ్రామం రెండు కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. మట్టిరోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. దీంతో కాలినడకన రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది పడుతున్నాం.

– రాందాస్ పటేల్

మహిళలతో కిక్కిరిసిన బస్‌లు



బస్ కోసం వేచిచూస్తున్న మహిళలు

ఇచ్చోడ: రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్‌లో ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆదివారం మహిళల సందడి కనిపించింది. మండల కేంద్రం నుంచి వెళ్లే ప్రతీ బస్సులో మహిళ ప్రయాణికులతో కిక్కిరిసింది.ఆదివారం సెలవు దినం కావడంతో రద్దీ కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు ఇచ్చోడ కేంద్రంగా ఆర్టీసీ బస్‌ల్లో వివిధ ప్రాంతాలకు దాదాపు 5 వేల మహిళలు ప్రయాణించిట్లు ఆర్టీసీ కంట్రోలర్ తెలిపారు.

కంకర వేశారు.. తారు మరిచారు



కంకర రోడ్డుపై వాహనదారుల ఇక్కట్లు

నేరడిగొండ: మండలంలోని లింగట్ల– గోండుగూడ గ్రామానికి ఆరు నెలల క్రితం తారు రోడ్డు మంజూరు కాగా పనులను అసంపూర్తిగా వదిలేశారు. దీంతో ఆ దారిగుండా వెళ్లే గ్రామస్తులు, వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. రాత్రి సమయంలో ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారు రోడ్డు వేయాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రశాంతంగా ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో ఆదివారం ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రశాంతంగా నిర్వహించారు. ఈ పరీక్ష కేంద్రంలో ఖానాపూర్, కడెం, పెంబి, దస్తురాబాద్ మండలాలకు చెందిన 156 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 154 మంది హాజరైనట్లు చీఫ్ సూపరింటెండెంట్ సంధ్యారాణి, డీవో ఊర్మిళ తెలిపారు. కాగా పరీక్ష కేంద్రంలో కుభీర్ డిప్యూటీ తహసీల్దార్ పద్మావతి సిట్టింగ్‌స్క్వాడ్ బాధ్యతలు నిర్వహించారు. ఈ పరీక్షలో ఉత్తీర్ణత సాధించిన ఎనిమిదో తరగతి విద్యార్థులు ఇంటర్ వరకు ప్రతిఏటా రూ.12వేల ఉపకార వేతనం పొందనున్నారు.



ప్రమాదకరంగా విద్యుత్ తీగలు

బేల మండలంలోని డోప్టాల గ్రామ శివారులో 353(బీ) జాతీయ రహదారి పక్కన 33 కేవీ విద్యుత్ తీగలు ప్రమాకరంగా మారాయి. చేతికి అందే ఎత్తులో వేలాడుతున్నాయి. అధికారులు స్పందించి తీగలను సరిచేయించాలని ప్రజలు కోరుతున్నారు. – బేల